ఉదయమే పైరవీలు!

మొదటిపేజీ తరువాయి...

పీఏను. ఒక ఫైల్ కాసేపట్లో మీ దగ్గరకు వస్తుంది. చూసి వెంటనే క్లియర్ చేయండి. సర్ దీని గురించి ఫాలోఅప్ చేస్తున్నారు. ఫైల్ మీవద్దకు రాగానే నాకు ఎప్పటికప్పుడు అప్‌డేట్ ఇవ్వండి. మీకు నమ్మకమైన ఆర్డీవోకు ఆ పని అసైన్ చేయండి'. లేదంటే సర్ దగ్గర మాట వస్తుంది. ముందుగా ఆ ఫైల్ పని కంప్లీట్ చేయండి.. అంటూ ఆదేశాలు

ఇలా ఒకటి కాదు.. రెండు కాదు.. పలు విభాగాల్లోని ఉన్నతాధికారులకు సదరు పీఏ నుంచి ఫోన్లు వస్తున్నాయి. ప్రస్తుతం ఈ అంశం అధికార వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ఉన్నతాధికారుల నుంచి మొదలుకొని కిందిస్థాయి అధికారుల వరకు ఈ అజ్ఞాత వ్యక్తి ఫోన్ కాల్స్ గురించే మాట్లాడుకుంటున్నారు. ఎలాంటి అధికార హోదాలేని వ్యక్తి.. ఇలా ప్రభుత్వ విభాగాల్లో వేలు పెట్టడమేంటని ప్రశ్నిస్తున్నారు. నేరుగా ఉన్నతాధికారులకే ఫోన్లు చేసి ఆదేశాలివ్వడంపై విస్తుపోతున్నారు. ఎక్కడో ఉండి నేరుగా ఫోన్లలో ఆదేశాలు ఇవ్వడంతో వారు ఇబ్బంది పడుతున్నారు. ఆయన ఆదేశాలు పాటిస్తే తమకు ఎదురయ్యే ఇబ్బందులకు బాధ్యత ఎవరిదంటూ పలువురు అధికారులు ఓ సన్నిహిత ఐఏఎస్ దగ్గర ఆవేదన వ్యక్తం చేసినట్లు సమాచారం. రోజురోజుకూ ఈ ఫోన్ కాల్స్ కారణంగా తమకు శాఖాపరంగా ఇబ్బందులు ఎదురవుతున్నాయని చెప్పుకున్నట్టు తెలుస్తున్నది.



ముఖ్యనేత అనుచరుడిగా నామినేటెడ్ పోస్ట్ పొంది..

ఈ ఫోన్‌కాల్స్ వ్యవహారంపై ప్రస్తుతం అధికారవర్గాల్లో జోరుగా చర్చ సాగుతున్నది. ప్రభుత్వంలోని ఓ ముఖ్య నేత అనుచరుడిగా ఉన్న సదరు వ్యక్తికి ఇటీవలే ఓ నామినేటెడ్ పోస్ట్ ఇచ్చినట్లు సమాచారం. ముఖ్యనేత ఇటీవల విదేశీ పర్యటనకు వెళ్తుండగా, ఈ వ్యక్తిని కూడా తీసుకెళ్లాలని ప్రయత్నించినట్టు సమాచారం. నిబంధనలు ఒప్పుకోకపోవడంతో వెంటనే నామినేటెడ్ పోస్ట్ ఇచ్చి విదేశీ పర్యటనకు అవకాశం కల్పించినట్టుగా తెలుస్తున్నది. జాతీయ స్థాయి మీడియా వ్యవహారాలు చూసే పోస్టులో ఆయనను నియమించినట్టుగా అధికార వర్గాలు చెబుతున్నాయి. ఇక అప్పటి నుంచి అతడి హవాకు తిరుగులేదని చెప్తున్నారు. కొన్నేండ్ల కిందట రాష్ట్రాన్ని ఓ కుదుపు కుదిపిన ఎమ్మెల్యే కొనుగోలు కేసులో నిందితుడిగా ఉన్నట్టు గుసగుసలు వినిపిస్తున్నాయి. ఇప్పుడు కూడా సర్ పేరు చెప్పుకుంటూ బెదిరింపులకు దిగడం, తన పనులు చేసి పెట్టాలని ఒత్తిడి తేవడం చేస్తుండడంతో అధికారులు బెంబెలెత్తిపోతున్నారు. ఈ విషయంపై ఎవరికి చెప్పుకోవాలో అర్థం కాక సన్నిహిత ఉన్నతాధికారుల వద్ద తమ గోడు వెళ్లబోసుకుంటున్నట్టు తెలుస్తున్నది.

ముందుగా ఫైనాన్స్‌శాఖకే ఫోన్లు

ప్రభుత్వం వచ్చిన మొదట్లో ఫైనాన్స్ శాఖ అధికారులకే సదరు వ్యక్తి నుంచి ఫోన్ కాల్స్ వచ్చినట్టు సమాచారం. పలువురు కాంట్రాక్టర్ల వద్ద 10 శాతం కమీషన్ తీసుకొని, ఆ శాఖ అధికారుల మీద ఒత్తిడి తెచ్చి వందల కోట్ల పెండింగ్ బిల్స్ క్లియర్ చేయించినట్టు తెలుస్తున్నది. ఆ తర్వాత రెవెన్యూ, ఎక్సైజ్, ఐఅండ్ పీఆర్ శాఖల్లో తలదూర్చి ఫైళ్లను క్లియర్ చేయించినట్టు సంబంధిత విభాగాల అధికారులు బహిరంగంగానే చర్చించుకుంటున్నారు. ప్రిన్సిపల్ సెక్రటరీ నుంచి మొదలుకొని సెక్షన్ ఆఫీసర్ల వరకు ఈ అజ్ఞాత వ్యక్తి నుంచి ఫోన్ కాల్స్ అందుకున్నట్టు సమాచారం. ప్రభుత్వంలో కీలక వ్యక్తి పీఏ , పీఆర్వో అని చెప్పుకుంటూ పనులు చేయాలని ఒత్తిడి తెస్తుండగా, అధికారులు ఆందోళనకు గురవుతున్నారు. తొలుత చిన్నపనులే అనుకుంటే ఇప్పుడు పెద్దపెద్ద పనులు చేయాలని ఒత్తిడి తెస్తుండడంతో అధికారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్టు తెలుస్తున్నది. సర్ ఆరా తీస్తున్నారంటూ బెదిరించడం ఎక్కువవుతుండడంతో ఆయా విభాగాల సిబ్బంది ఆందోళనకు గురవుతున్నారు. నేరుగా ప్రభుత్వంలోని ఓ కీలక కార్యాలయం నుంచి ఫోన్లు చేస్తూ పనులు చేసిపెట్టాలని ఆదేశిస్తుండడంతో, అధికారులంతా హడలెత్తిపోతున్నారు.

రాష్ట్రంలో గట్టి టాక్స్!



మొదటిపేజీ తరువాయి...

కూడా తమ చిన్న చిన్న క్లెయిమ్‌లను తీసుకోవాలంటే పైసలు ముట్టజెప్పనిదే పని కావటం లేదన్న ఆరోపణలు వస్తున్నాయి. ఉద్యోగుల బిల్లుల విషయంలో ఆర్థికశాఖలోని కొందరు ఉద్యోగులే బ్రోకర్లుగా అవతారమెత్తగా, కాంట్రాక్టర్లు, పెద్ద బిల్లుల విషయంలో ప్రభుత్వంలోని పెద్ద తలకాయలే జోక్యం చేసుకొని పర్సంటేజీలు మాట్లాడుకుంటున్నట్టు వార్తలు వస్తున్నాయి. గత ఏడాది సెప్టెంబర్ నుంచి ప్రభుత్వంలోని రకరకాల బిల్లులు ఆగిపోయాయి. అసెంబ్లీ ఎన్నికలు, ఆ తర్వాత పార్లమెంటు ఎన్నికలు, రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం కొలువుదీరటంతో అంతా గందరగోళ పరిస్థితులు తలెత్తాయి. దీంతో కాంట్రాక్టర్లకు బిల్లులు రాలేదు. తొలుత కొంతమంది చిన్నాచితక కాంట్రాక్టర్లకు నిధులు మంజూరు చేసినా ప్రతిదానికీ ఒక రేటు పెట్టినట్టు భోగట్టా. రూ.కోటి, ఆపైన ఉండే బిల్లులకు కాంట్రాక్టర్లకు ఉండే తొందర, అవసరాన్ని ఉపయోగించుకొని 'గట్టి' టాక్స్ విధిస్తున్నారు. ఇలాంటి బిల్లుల వసూలు సందర్భంగా చాలా జాగ్రత్తగా వ్యవహరిస్తున్నారు. ఆర్థికశాఖలోని ఒక ముఖ్యమైన వ్యక్తే ఆయన కుటుంబ సభ్యులను నేరుగా రంగప్రవేశం చేసి బిల్లులను క్లియర్ చేయిస్తున్నట్టు అధికారులు బహిరంగంగానే మాట్లాడుకుంటున్నారు.

ఆమెదే డామినేషన్

ఆర్థికశాఖలో బిల్లుల విషయంలో 'ఆమె' పైనే ఆరోపణలు గుప్పుమంటున్నాయి. సారును కాదు.. ఆమెను కలిస్తే తొందరగా పని అవుతుందని పేషీ అధికారులే చెప్తున్నట్టు సమాచారం. రోజువారీగా జరిగే అధికారిక కార్యక్రమాలను పక్కన పెడితే.. బిల్లులకు సంబంధించిన రోజువారీ వ్యవహారాలను మేడంగారే చక్కబెడుతున్నారట. పుత్రరత్నం కూడా వసూళ్లలో ఒక చెయ్యేస్తున్నట్టు తెలిసింది. పార్లమెంటు ఎన్నికల ముందు రోజుకు సగటున కనీసం రూ. వంద కోట్ల బిల్లులు మంజూరు చేయించనిదే మేడంగారు నిద్రపోయేవాళ్లు కాదని చెప్తున్నారు. 'సారు' కూడా ఇంటి నుంచి వచ్చిన ఆ టోకెన్లను అధికారులకు ఇచ్చి పనిచేయించేవారట. పెద్ద మొత్తాల్లో బిల్లులు ఉంటే అందులో కొంత మొత్తాన్ని విడదీసి తొలుత రిలీజ్ చేసేవారు. ఫస్ట్ రిలీజ్ చేసిన సొమ్ము నుంచి కమిషన్ అప్పగిస్తే మరుక్షణమే మిగిలిన సొమ్ము బిల్లులు మంజూరైపోతున్నాయని చెప్పుకుంటున్నారు. ఎంత బిల్లుకు ఎంత పర్సంటేజీ అన్నది కాంట్రాక్టరు అవసరాన్ని బట్టి ఖరారవుతుంది. ముఖ్యుల సిఫార్సుతో వచ్చిన బిల్లుల్లో కూడా ఏడు శాతానికి అదనంగా 1-2 పర్సంటేజీ ఇస్తేకానీ ఫైళ్లు కదలడంలేదని చెప్తున్నారు. ఆర్థికశాఖలో బిల్లులు మంజూరు చేయించటానికి సంబంధించి ఇలా ఏకంగా ప్రత్యేక వ్యవస్థనే ఏర్పాటు చేశారని చెప్తున్నారు.

ఢిల్లీ పేరుతో హల్‌చల్

7 శాతం సొమ్మును హైకమాండ్‌కు చెల్లించాల్సి ఉంటుందంటూ కాంట్రాక్టర్ల వద్ద నుంచి వసూలు చేసినట్టు తెలిసింది. కొంతమంది బడా కాంట్రాక్టర్లను సిండికేట్ చేసి మరీ వసూళ్లకు పాల్పడ్డారని ఆరోపణలు వినబడుతున్నాయి. ఈ ఏడు శాతాన్ని తామే నేరుగా పంపించుకుంటామని వసూలు చేసినట్టు సమాచారం. 7 శాతం కమీషన్ ఢిల్లీకి పోతుందని, తమకు ఖర్చులకు ఒక శాతం ఇవ్వాలని కూడా వసూళ్లకు పాల్పడ్డారు. మొత్తంగా 8 శాతం చెల్లిస్తేనే బిల్లు మొత్తం విడుదలయ్యేది. లేకపోతే పెండింగే. కొంత మంది పార్టీ మారిన ఎమ్మెల్యేలు ఇటీవల బిల్లులు మంజూరు కోసం వెళ్లగా.. 'అన్నా మీరు కూడా 7 శాతం ఇవ్వాల్సిందే. మీకు కావాలంటే ఇంకేమైనా పని తెచ్చుకోండి చేసి పెడ్తాం' అని చెప్పినట్టు సమాచారం. ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన ఓ జడ్పీటీసీ రూ.పది కోట్ల బిల్లును వసూలు చేసేందుకు కొత్తగా ఎన్నికైన ఒక ఎమ్మెల్యేకు 8 శాతం కమీషన్ ముట్టచెప్పుకున్నట్టు తెలిసింది. ఇదే ప్రాంతం నుంచి పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా పోటీచేసిన ఓ అభ్యర్థికి సర్దుబాటు చేయాల్సి వచ్చిందని చెప్తూ ఓ కాంట్రాక్టర్‌కు భారీ బిల్లును మంజూరు చేశారు. దీంట్లో రూ.25 కోట్లు అభ్యర్థి ఖర్చు కింద చూపించారట.

గట్టి టాక్స్.. పొట్టి టాక్స్

గట్టి టాక్స్‌ను ఒకరే వసూలు చేస్తే పెద్దాయన ఏమై పోవాలి? అందుకే రాష్ట్రంలోని అతి పెద్ద ఇంజినీరింగ్ కంపెనీకి చెందిన ఆర్థిక వ్యవహారాల ఇన్‌చార్జికే వసూళ్ల బాధ్యతలు అప్పగించారు. ఆయన అతి పెద్ద కాంట్రాక్టర్లను ముఠా కట్టించి వసూళ్లు చేసి పెడుతున్నాడు. ఈ వ్యవహారం బడాకాంట్రాక్టర్లకు తలనొప్పిగా మారింది. మహబూబ్‌నగర్ జిల్లాలో ప్రారంభించబోయే ఎత్తిపోతల పథకానికి కాంట్రాక్టర్‌ను వీళ్లు ఇప్పటికే సిద్ధం చేశారు. దీంట్లో గట్టి టాక్స్‌తో పాటు పొట్టి టాక్స్‌లు కూడా ఉంటాయని గుసగుసలు వినిపిస్తున్నాయి. త్వరలోనే మరిన్ని ప్రాజెక్టులు వస్తాయని, అన్నింట్లోనూ సిండికేట్ చేసే వ్యవహారాలను ఈ బడా కంపెనీతోపాటు రాష్ట్రంలోని మరో మంత్రి కంపెనీకి అప్పగించినట్టు కాంట్రాక్టర్ల వర్గాల్లో చర్చ జరుగుతున్నది.

మరో రైతు ఆత్మహత్య

శ్రీనివాస్ (ఫైల్)

నర్సాపూర్, సెప్టెంబర్ 21: అప్పుల బాధలు భరించలేక రాష్ట్రంలో మరో అన్నదాత తనువు చాలించాడు. అప్పులు తీర్చే మార్గం కనిపించక పోవడంతో మనస్తాపం చెంది ఉరేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటన శనివారం మెదక్ జిల్లా నర్సాపూర్ మండలం తుజాల్‌పూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని అర్జున్ తండాలో చోటుచేసుకుంది. తండాకు చెందిన రైతు హళావత్ శ్రీనివాస్ (41) వ్యవసాయం చేస్తూ కుటుంబాన్ని పోషించేవాడు. ఆయన వ్యవసాయంతోపాటు కుటుంబ అవసరాలకు రూ.4 లక్షల వరకు అప్పు చేశాడు. ఆ అప్పు ఎలా తీర్చాలో తెలియక కొద్దిరోజులుగా ఆందోళన చెందుతున్నాడు. శనివారం తెల్లవారుజామున బయటకెళ్తున్నట్టు భార్య హళావత్ లక్ష్మీకి చెప్పి బయలుదేరాడు. ఎంతకూ తిరిగి రాకపోవడంతో ఆందోళన చెందిన భార్య లక్ష్మి చుట్టుపక్కల వాకబు చేసింది. అంతటా వెతకగా ఉదయం 6 గంటల సమయంలో తన ఇంటి వెనకాల పొలంలో చెట్టుకు ఉరేసుకుని విగతజీవిగా కనిపించాడు. మృతుడికి భార్య, కుమారుడు, కూతురు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు నర్సాపూర్ ఎస్సై లింగం తెలిపారు.

32 ముక్కలుగా కోసి ఫ్రిడ్జిలో దాచారు

బెంగళూరు: బెంగళూరులోని వయలికవల్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ మహిళను దారుణంగా హతమార్చారు. ఏసీపీ సతీశ్ కుమార్ కథనం ప్రకారం... మహాలక్ష్మీ(29) అనే మహిళను తన ఇంట్లోనే హతమార్చి, 32 ముక్కలుగా కోసి ఫ్రిడ్జిలో దాచిపెట్టారు. దాదాపు 4-5 రోజుల క్రితం ఈ ఘటన జరిగింది. బాధితురాలు ఇంట్లో ఒంటరిగా నివసిస్తుండటం వల్ల ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చిం ది. ఈ దారుణ హత్యపై పోలీసులు విచారణ జరుపుతున్నారు. గత ఏడాది ఇలాంటి ఘటనే ఢిల్లీలో జరిగింది. శ్రద్ధా వాకర్ అనే యువతిని ఆమె ప్రియుడు దారుణంగా హతమార్చి ముక్కలు చేసిన ఘటన తెలిసిందే.

సాగర్ కాల్వకు మరోచోట గండి

ఆదివారం రాత్రి వరకు నీరందిస్తాం: సీఈ విద్యాసాగర్

కూసుమంచి, సెప్టెంబర్ 21: ఖమ్మం జిల్లా పాలేరు వద్ద సాగర్ కాల్వ యూటీ ప్రాంతంలో శనివారం లీకేజీ కావడంతో నీరంతా దిగువకు వెళ్తున్నది. దీనిని గుర్తించిన అధికారులు వెంటనే నీటి ప్రవాహాన్ని నిలిపివేసి మళ్లీ పనులు చేపట్టారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలు, వరదలతో సాగర్ ఎడమ కాల్వకు ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం హట్యాతండా వద్ద ఈ నెల ఒకటో తేదీన గండిపడిన విషయం తెలిసిందే. దానికి మరమ్మతులు చేసిన అధికారులు శనివారం నుంచి సాగు నీటిని విడుదల చేయాలని ఏర్పాట్లు చేశారు. అయితే క్రాస్ బండ్‌కు సమీపంలో కాల్వ వద్ద ఉన్న యూటీ పక్కన మరమ్మతులు చేశారు. నీటిని విడుదల చేసేందుకు బండ్‌ను తొలగించడంతో రెండు మీటర్ల మేర ఆగి ఉన్న నీరు యూటీ మధ్య వాల్ నుంచి వెళ్లింది. దీంతో లీకేజీ పెద్దగా మారుతుందని భావించిన అధికారులు వెంటనే మళ్లీ బండ్ వేసి నీటిని నిలిపివేశారు. దీంతో నీటి విడుదలకు మరో రోజు బ్రేక్ పడింది. వెంటనే మరమ్మతుల కోసం మళ్లీ పైపులు తెప్పించి సాయంత్రం పనులు మొదలు పెట్టారు. 1975లో కట్టిన యూటీ వాల్స్ పటిష్టత విషయంలో చర్యలు చేపట్టకపోవడం వల్లే మళ్లీ లీకేజీ అయినట్టు తెలుస్తున్నది. కాగా.. యూటీ వద్ద ఉన్న వాల్ 1975లో కట్టడం వల్ల దాని దగ్గరే సమస్య వచ్చిందని, వెంటనే అప్రమత్తమై అడ్డుకట్టు వేసి నీటిని నిలిపివేశామని, ఆదివారం రాత్రి వరకు మళ్లీ నీటిని ఇస్తామని సీఈ విద్యాసాగర్ తెలిపారు. కాల్వకు బుంగ పడినట్టు వస్తున్న వార్తల్లో నిజం లేదని స్పష్టంచేశారు.

సీఎంతో వరల్డ్ బ్యాంక్ బృందం భేటీ

- రాష్ట్ర పథకాలను వివరించిన రేవంత్‌రెడ్డి
- ఆర్థిక సహకారం అందించాలని విజ్ఞప్తి

హైదరాబాద్, సెప్టెంబర్ 21 (నమస్తేతెలంగాణ): వరల్డ్ బ్యాంకు సౌత్ ఏసియన్ వైస్ చైర్మన్ మార్టిన్ రైజర్ నేతృత్వంలోని ప్రతినిధి బృందం శనివారం సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసింది. గత నెలలో సీఎం రేవంత్ అమెరికా పర్యటనలో భాగంగా వరల్డ్ బ్యాంక్ చైర్మన్ అజయ్ బంగాతో భేటీ అయిన నేపథ్యంలో తదుపరి చర్చల కోసం తాజాగా ఆ బృందం సీఎంను కలిసింది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి పట్టణ మౌలిక వసతుల అభివృద్ధి, విద్య, వైద్యరంగాలకు ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యాన్ని వారికి వివరించారు. తమ సర్కారు చేపట్టిన ప్రాజెక్టులకు ఆర్థిక సహకారం అందించాలని కోరారు. ఇందుకు వారు కూడా సానుకూలంగా స్పందించారు. సమావేశంలో నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, సీఎస్ శాంతికుమార్, ముఖ్యమంత్రి ఆఫీసు ప్రిన్సిపల్ సెక్రటరీ శేషాద్రి, ప్రత్యేక కార్యదర్శి అజిత్‌రెడ్డి ఇతర ఉననతాధికారులు పాల్గొన్నారు.

జెన్‌కోలో 62 మందికి పదోన్నతులు

హైదరాబాద్, సెప్టెంబర్ 21 (నమస్తే తెలంగాణ) : టీజీ జెన్‌కోలో 62మంది ఉద్యోగులకు సంస్థ యాజమాన్యం పదోన్నతులు కల్పించింది. ఏకకాలంలో పదోన్నతులు కల్పించడం పట్ల విద్యుత్తు అకౌంట్స్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ (వీఏవోఏటీ) హర్షం వ్యక్తంచేసింది. ఈ సందర్భంగా శనివారం ఉద్యోగులు విద్యుత్తు సౌధలో మిఠాయిలు పంచుకుని సంతోషాన్ని వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా వీఏవోఏటీ ప్రధాన కార్యదర్శి పాపకంటి అంజయ్య మాట్లాడుతూ కోర్టుకేసులతో అనేక ఏండ్లుగా పదోన్నతులు దక్కలేదని, ఆయా సమస్యలను పరిష్కరించి పదోన్నతులు కల్పించిన ప్రభుత్వానికి, అధికారులకు ధన్యవాదాలు తెలిపారు.

పాడి రైతులకు పాగ

ప్రైవేటు డెయిరీలకు వెళ్లేలా కుట్రలు

- మూడు నెలలుగా బిల్లుల చెల్లింపులు బంద్
- విజయ డెయిరీ బకాయిలు 150 కోట్లు
- ప్రభుత్వంపై పాడి రైతుల పోరుబాట
- 26న ధర్నాచౌక్‌లో భారీ ధర్నాకు పిలుపు

హెరిటేజ్ జాతర.. 'విజయ'కు పాతర

హైదరాబాద్, సెప్టెంబర్ 21(నమస్తే తెలంగాణ): విజయ డెయిరీకి పాలు పోసే రైతులను ఆ సంస్థకు దూరం చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయా..? రైతులను ప్రైవేటు డెయిరీలకు మళ్లించే కుట్ర జరుగుతున్నదా..? ఇందులో భాగంగానే పాల బిల్లులను చెల్లించడం లేదా..? విజయ డెయిరీలో, పాడి రైతుల్లో ఈ చర్చ జోరుగా జరుగుతున్నది. నిప్పులేనిదే పొగరాదన్నట్టుగా ఈ చర్చకు బలం చేకూర్చేలా ప్రభుత్వం, విజయ డెయిరీ వ్యవహారశైలి ఉన్నది. విజయ డెయిరీ కథను ముగించేందుకు కొందరు ప్రభుత్వ పెద్దలు, విజయ డెయిరీ అధికారులు తెరవెనుక భారీ ప్లాన్ వేసినట్టుగా సమాచారం. విజయ డెయిరీ నుంచి పాడి రైతులకు బిల్లుల చెల్లింపును నిలిపివేశారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. సుమారు మూడు నెలల నుంచి రైతులకు రూ. 150 కోట్ల వరకు బిల్లులు బకాయి ఉన్నట్టుగా తెలిసింది. ఇలా బిల్లులు నిలిపివేస్తే రైతులు విసిగి వేసారి విజయ డెయిరీకి పాలు పోయడం మానేసి ప్రైవేటు డెయిరీకి వెళతారనే దుర్మార్గపు ఆలోచన చేస్తున్నట్టుగా తెలిసింది. ప్రస్తుతం విజయ డెయిరీకి సుమారు 40 వేల మంది రైతులు ప్రతిరోజు 4 లక్షల లీటర్ల పాలు పోస్తున్నారు.

ప్రైవేటు డెయిరీల బలోపేతం!

రాష్ట్రంలో హెరిటేజ్ వంటి ప్రైవేటు సంస్థలను ప్రోత్సహించేందుకు తెరవెనుక ప్రయత్నాలు జరుగుతున్నట్టుగా తెలిసింది. ఇప్పటికే సదరు సంస్థ శామీర్‌పేటలో రూ.200 కోట్లకు పైగా పెట్టుబడితో ఐస్‌క్రీం తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఐస్‌క్రీం తయారీకి విజయ డెయిరీ దెబ్బ తినడానికి ఏంటి సంబంధం అనే ప్రశ్న తలెత్తె అవకాశం ఉంది. ఇక్కడే అసలు కుట్ర దాగిందని చెబుతున్నారు. ఐస్‌క్రీం తయారీకి పెద్ద మొత్తంలో పాలు అవసరం. హెరిటేజ్ సంస్థకు అంత భారీ స్థాయిలో రాష్ట్రంలో పాల సేకరణ లేదు. ఈ నేపథ్యంలో విజయ డెయిరీ వంటి సంస్థలను అడ్డు తొలిగిస్తే రైతుల నుంచి తక్కువ ధరకే పాలసేకరణ చేయొచ్చనే ఆలోచన చేస్తున్నట్టుగా తెలిసింది. దీంతో పాటు మరో సొసైటీ డెయిరీని బలోపేతం చేసే దిశగా కసరత్తు జరుగుతున్నట్టుగా తెలిసింది. ఇందుకు సంబంధించి ఓ కీలక నేత బాధ్యతలు చేపట్టి పని మొదలుపెట్టినట్టుగా తెలిసింది. తద్వారా మళ్లీ వాళ్ల పాత సామ్రాజ్యాన్ని నిర్మించుకునే దిశగా కసరత్తు చేస్తున్నట్టుగా తెలిసింది. ఇందులో భాగంగానే విజయ డెయిరీని క్రమంగా బలహీన పరిచే కుట్రలకు తెరలేపినట్టుగా పెద్దఎత్తున ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.

పాల బిల్లుల కోసం పోరుబాట

పాల బిల్లుల కోసం మూడు నెలల పాటు వేచి చూసి ప్రభుత్వాన్ని, అధికారులను చుట్టూ తిరిగి విసిగి వేసారిన పాడి రైతులు ప్రభుత్వంపై పోరుకు సిద్ధమవుతున్నారు. ఈ నెల 26న ఇందిరా పార్క్ ధర్నా చౌక్‌లో భారీ ధర్నాకు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే రాష్ట్ర వ్యాప్తంగా రైతులు ఎక్కడికక్కడ ధర్నాలు చేస్తున్నారు. రోడ్లపై పాలు పారబోసి తమ నిరసన వ్యక్తం చేస్తున్నారు. దీంతో పాటు అధికారులను, నూతనంగా నియమితులైన చైర్మన్‌ను కలిసి మొరపెట్టుకున్నారు. ఎవరిని కలిసినా ఎలాంటి ప్రయోజనం లేకపోవడంతో పోరుకు సిద్ధమయ్యారు.

బిల్లుల కోసం రోడ్డెక్కుతున్నాం

నాలుగేండ్ల నుంచి విజయ డెయిరీకి పాలు పోస్తున్నా. కాంగ్రెస్ సర్కారొచ్చాక బిల్లుల కోసం రోడ్ల మీదికి వచ్చి ధర్నాలు చేయల్సి వస్తున్నది. వడ్డీ వ్యాపారుల వద్ద అప్పులు చేసి కుటుంబాలు నెట్టుకొస్తున్నాం. దాణా, మినరల్ మిక్చర్, వైద్య ఖర్చులకు డబ్బులు లేక వ్యాపారం నిర్వహణకు అవస్థలు పడాల్సి వస్తోంది. బిల్లులు చెల్లించాలని ప్రజాప్రతినిధులు, అధికారులను వేడుకున్నా ఫలితం లేదు.

- ఎం.బాలరాజు, రైతు, పోమాల, నవాబ్‌పేట, మహబూబ్‌నగర్ జిల్లా

రూ.60 లక్షల బిల్లులు ఇవ్వాలి

ప్రభుత్వం పాల ఉత్పత్తిదారులకు ఇప్పటివరకు రూ. 60 లక్షల బిల్లులు చెల్లించాల్సి ఉంది. నర్సంపేట విజయ డెయిరీ పరిధిలోని రెండు వేల మంది రైతులకు మూడు నెలలుగా బిల్లులు చెల్లించాల్సి ఉంది. బోనస్ బిల్లులు కూడా పెండింగ్‌లోనే ఉన్నాయి. రైతులు పశువులకు దాణా, పచ్చిగడ్డి కొనుగోలుకు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. పాడి రైతులకు సరైన సమాధానం చెప్పలేక పోతున్నాం.

- బండి రాజ్‌కుమార్, ఇన్‌చార్జి మేనేజర్, విజయ డెయిరీ, నర్సంపేట, వరంగల్ జిల్లా

నిరసనలు చేసినా ఫలితం లేదు

కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చినంక బిల్లుల కోసం కండ్లలో వత్తులేసుకొని ఎదురుచూడాల్సి వస్తోంది. గత 75రోజులుగా ఐదు బిల్లులు చెల్లించలేదు. దీంతో పశు పోషణ భారంగా మారింది. పాల బిల్లు కోసం అనేకమార్లు నిరసనలు చేశాం. ఎండీని కలిసి వినతిపత్రాలు సమర్పించినా ఫలితం లేకుండా పోయింది. ప్రభుత్వంలో చలనం రాలేదు. బిల్లులు చెల్లించి విజయ డెయిరీ రైతులను ఆదుకోవాలి.

- ఇమ్మడి శ్రీను, పాడి రైతు, లాలాపురం, కొణిజర్ల మండలం, ఖమ్మం జిల్లా

కలెక్టరాఫీసు వద్ద దీక్షలు చేస్తాం

భైంసా ఎస్‌బీఐలో ముద్ర రుణం రూ.10లక్షలు తీసుకుని 16 ఆవులు, 3 బర్రెలు తీసుకొచ్చాను. పల్సీలోని విజయ డెయిరీ పాల సేకరణ కేంద్రంలో ప్రతి రోజూ 150 నుంచి 180 లీటర్ల పాలు పోస్తాను. ప్రతి నెలా నాకు రూ.30వేల ముద్ర రుణం కిస్తుతో పాటు పశువుల దాణాకు రూ.60వేలు అవసరం. మూడు నెలలుగా డబ్బులు రాక ఇబ్బందులు తలెత్తాయి. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం విజయ డెయిరీ మూతవేయక ముందే పాడి రైతులందరం కలెక్టర్ కార్యాలయాలం వద్ద నిరాహార దీక్షలకు వెనుకాడబోం.

-గుడ్డిబాయి దత్తాత్రి, పాడిరైతు, నిర్మల్(హెచ్), కుభీర్ మండలం, నిర్మల్ జిల్లా

రూ. 25 లక్షలు రావాలి..

కాంగ్రెస్ ప్రభు త్వం వచ్చాక జూలై 16వ తేదీ వరకు బిల్లులు చెల్లించారు. ఆ తర్వాత నుంచి బిల్లుల ఉసెత్తం లేదు. మా గ్రామ సంఘంలోని 150 మంది రైతుల నుంచి ప్రతిరోజు సేకరించిన 900 లీటర్ల పాలు జహీరాబాద్‌లోని విజయ డెయిరీ కేంద్రానికి వెళ్తాయి. మా సంఘానికి పాల బిల్లులు రూ. 25 లక్షల వరకు రావాల్సి ఉంది.

- బరూర్ మాణిక్‌రెడ్డి, విజయ డెయిరీ పాల ఉత్పత్తిదారుల సంఘం అధ్యక్షుడు, మామిడ్గి గ్రామం, సంగారెడ్డి జిల్లా

నల్లగొండ జిల్లా మాడ్గులపల్లి మండలం గోపలాపురం వద్ద డీ-37 కాల్వలోకి దిగి నిరసన వ్యక్తం చేస్తున్న రైతులు

మాడ్గులపల్లి రైతుల నిరసన

డీ-37 కాల్వకు నీరందడంలేదని రైతుల ఆందోళన

మాడ్గులపల్లి, సెప్టెంబర్ 21: డీ-37 కాల్వ చివరి భూముల సాగునీరందడం లేదని ఆరోపిస్తూ నల్లగొండ జిల్లా మాడ్గులపల్లి మండలంలోని గోపాలపురం, కన్నెకల్, మాచినపల్లి, కేశవాపురం గ్రామాల రైతులు శనివారం కాల్వలోకి దిగి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ.. డీ-37 కాల్వ నిర్మాణం కోసం అనేక మంది రైతులు తమ భూములను త్యాగం చేశారని, కాల్వ తవ్విన తర్వాత చివరి భూములకు నీరందక ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. మాడ్గులపల్లి మండలంలో డీ-37 కాల్వ 27 కిలోమీటర్ల మేర ఉండగా దీని ద్వారా 42 వేల ఎకరాలకు సాగునీరందించాలని, 19 చెరువులను నింపాలని గత బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్దేశించిందని పేర్కొన్నారు. కానీ.. ప్రస్తుతం కాల్వ ద్వారా విడుదలవుతున్న కొద్దిపాటి నీటిని మొదట ఉన్న రైతులకే సరిపోతున్నాయని, చివరి భూములకు నీరందక సాగు చేసిన పంటలు, తోటలు ఎండిపోయే స్థితికి చేరాయని పేర్కొన్నారు. నీటి విడుదలను పెంచి చివరి రైతులను ఆదుకోవాలని కోరారు.

- **కుప్పకూలిన కుమ్మరికుంట కెనాల్ వంతెన**